సాక్షి
ఒడిశా
ఆదివారం । 3 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.6,50,590
బంగారం 1 గ్రాము 850 మిల్లీ గ్రాములు
వెండి 21 గ్రాముల 280 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



జైలు వార్డర్ అనుమానాస్పద మృతి

కేంద్రాపడా జిల్లాలో జైలు వార్డర్ అనుమానాస్పద మృతి శనివారం తీవ్ర కలకలం రేపింది.

- 8లో



డిసెంబర్ 18 నుంచి గజపతి ఉత్సవాలు - 8లో

డిసెంబర్ 18వ తేదీ నుంచి గజపతి ఉత్సవాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్, ఉత్సవ కమిటీ చైర్మన్ బిజయ కుమార్ దాస్ తెలియజేశారు.

న్యూస్‌రీల్

సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రదీప్



డాక్టర్ ప్రదీప్ పండ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రదీప్ కుమార్ పండ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ రమేష్ సాహు పదోన్నతిపై బొలంగీర్‌కు బదిలీ అయ్యారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా డాక్టర్ పండ తెలిపారు. ఆయనకు ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు అభినందించి స్వాగతం పలికారు.

నందనకానన్‌లో పులి పిల్లల జననం



పిల్లలతో తెల్లిపులి రూప

భువనేశ్వర్: నగర శివారు బారంగ్ నందన్‌కానన్‌లో తెల్లపులి రూపా శనివారం 4 పిల్లలను ప్రసవించింది. పిల్లలను అక్కున చేర్చుకుని రూపా సంరక్షిస్తున్నట్లు జూ అధికార వర్గాల సమాచారం. వీటి కదలికని సీసీటీవీ పర్యవేక్షణలో అనుక్షణం పరిశీలిస్తున్నారు. రూపా తెల్ల పులి వరుసగా ఇది మూడోసారి ప్రసవించడం విశేషం. శనివారం ఉదయం 5.43 గంటల నుంచి 9.31 గంటల మధ్య సుమారు 4 గంటల నిడివిలో ప్రసవించిన 4 పిల్లలు ఆరోగ్యవంతంగా కనిపిస్తున్నాయి. తల్లి ప్రత్యక్షంగా పిల్లలను సంరక్షిస్తున్నందున వేరు చేయడం సాధ్యం కాలేదు. లింగ నిర్ధారణ కూడ జరగలేదని జంతు ప్రదర్శన శాల అధికారులు తెలిపారు. వీటిలో తెల్ల, నల్లని చారల పిల్లలు ఉన్నట్లు భావిస్తున్నారు. రూపా నందన కానన్‌లో 2018 సంవత్సరం సెప్టెంబర్ 22వ తేదీన జన్మించింది. 6 ఏళ్ల ప్రాయంలో వరుసగా 3 సార్లు పిల్లలను ప్రసవించింది. తొలుత 2022 సంవత్సరం మార్చి, రెండోసారి 2023 సంవత్సరం జనవరి నెలలో పిల్లలను ఈనింది.

చెట్టును ఢీకొన్న బొలేరో



ప్రమాదానికి గురైన బొలేరో

రాయగడ: జిల్లాలోని తెరువలి నుంచి కల్యాణ సింగుపూర్ వైపు వెళ్తున్న ఒక బొలేరో కుసాబెటి ప్రాంతం మలుపు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సంఘటన స్థలం వద్దే మృతి చెందగా, బొలేరోలో ప్రయాణిస్తున్న మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. శనివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి కల్యాణ సింగుపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అలాగే క్షతగాత్రుడిని స్థానిక జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయి పట్టివేత



పట్టుబడిన భీమ సాగరియ

జయపురం: సబ్ డివిజన్ పరధి బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ పూజారిగుడ – కుంభకారి మార్గంలో బస్తాలతో గంజాయిని కావిడి కట్టి తీసుకెళ్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన వ్యక్తి తెంతులిగుమ్మ పంచాయతీ మధుపూర్ సమీపంలో రొణగుడ గ్రామానికి చెందిన సురేంద్ర అలియాస్ భీమ సాగరియగా పేర్కొన్నారు. పోలీసుల వివరణ మేరకు.. శుక్రవారం సాయంత్రం బొయిపరిగుడ పోలీసులు పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో భీమ సాగరియ కావిడితో గంజాయితో పట్టుబడ్డాడని, అతడిని అరెస్టు చేసి గంజాయితో స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. పట్టుబడిన గంజాయి తూయించగా 44 కేజీలు ఉన్నట్లు తెలిపారు. గంజాయిని కుంభకారి నుంచి గుప్తేశ్వర్ పంచాయతీ మీదుగా ఛత్తీష్‌ఘడ్ తీసుకెళ్తున్నట్లు నిందితుడు చెప్పాడని పోలీసులు వెల్లడించారు.



ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

బొలంగీరు అభివృద్ధే లక్ష్యం

- సీఎం మోహన్ చరణ్ మాఝి
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన



ఎయిర్ స్ట్రిప్ విస్తరణ పూజా కార్యక్రమంలో సీఎం



కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

భువనేశ్వర్: చారిత్రాత్మక బొలంగీరు జిల్లా బహుముఖ అభివృద్ధే లక్ష్యమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. బొలంగీరు జిల్లాలో రూ.65 కోట్ల తుషార్ ఎయిర్‌స్ట్రిప్ విస్తరణ, ఎగువ లాంథ్ సాగునీటి ప్రాజెక్టు, 17 తాగునీటి ప్రాజెక్టులు, 16 గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులు, 31 ఆరోగ్య శాఖ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. వీటి సమగ్ర వ్యయ ప్రణాళిక రూ.890 కోట్లుగా పేర్కొన్నారు. రూ.301 కోట్ల వ్యయ అంచనాతో చేపట్టనున్న ఎగువ లాంథ్ సాగునీటి ప్రాజెక్టుతో బొలంగీరు జిల్లాలో నీటిఎద్దడి తొలగిపోయి, సాగునీటి వనరులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టుతో జిల్లాలో 38 వేల మంది పైబడి రైతులు లబ్ధి పొందుతారని తెలియజేవారు. అదేవిధంగా బొలంగీరు జిల్లా పట్నగొడా ప్రాంతంలో రూ.23 కోట్ల 68 లక్షల వ్యయంతో నిర్మించిన అత్యున్నత శ్రేణి సబ్ డివిజనల్ ఆస్పత్రిని ముఖ్యమంత్రి ప్రారంభించారు. మెడిసిన్, శిశు, నేత్ర, ఎముకల చికిత్స, స్త్రీ, ప్రసూతి విభాగాలతో అల్ట్రా సౌండ్, ఎక్స్ – రే వంటి అధునాతన సౌకర్యాలు ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కిడ్నీ సంబంధిత రోగాల చికిత్స కోసం టిట్లాగడ్ సబ్ డివిజనల్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.57 లక్షల వ్యయంతో డయాలసిస్ యూనిట్‌ని ప్రారంభించారు.

వరి మద్దతు ధర పెంపు

రాష్ట్ర రైతాంగం సమగ్ర సంక్షేమానికి వరి కనీస మద్దతు ధర గణనీయంగా పెంచినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ సీజన్ నుంచి క్వింటాల్ వరి కనీస మద్దతు ధర రూ.3,200 అవుతుందని తెలిపారు. సమష్టి కృషితో 2036 సంవత్సరం నాటికి వికసిత ఒడిశా ఆవిష్కరణ సుసాధ్యం చేయాలని పిలుపునిచ్చారు.

అవినీతిపరులను ప్రోత్సహించొద్దు



అవినీతి నిర్మూలన వారోత్సవాలపై ర్యాలీ

- గజపతి విజిలెన్స్ ఎస్పీ జితేంద్రనాథ్ పండా



ప్రభుత్వ ఉద్యోగులతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి సంతోష్ కుమార్ మిశ్రా

పర్లాకిమిడి: అవినీతికి పాల్పడే ఉద్యోగులను కుటుంబ సభ్యులు ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రోత్సాహించవద్దని గజపతి జిల్లా విజిలెన్స్ ఎస్పీ జితేంద్రనాథ్ పండా సూచించారు. గజపతి జిల్లా స్థాయి అవినీతి నిర్మూలన వారోత్సవాల ముగింపు సమావేశం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతిలో ప్రపంచ దేశాల్లో భారత్ 39వ స్థానంలో ఉందన్నారు. అవినీతిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలని కలెక్టర్ బిజయకుమార్ దాస్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, ఇన్‌కం టాక్సులు ఇతరత్రా అన్నీ నగదు రహిత పేమెంట్లుకు ప్రోత్సహిస్తున్నందున అవినీతి కొంతమేర తగ్గే అవకాశం ఉందని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు పేర్కొన్నారు. అనంతరం అవినీతి రహిత పాలనను అందిస్తామని ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులతో కలెక్టర్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఓఎస్‌డీ(బరంపురం) సంతోష్ కుమార్ మిశ్రా, పురపాలక చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గుణనిధి నాయక్, అవినీతి నివారణ అధికారి వాసుదేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రోహిత్ కుమార్ కుండు అరెస్టు



డాక్టర్ కుండు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

రాయగడ: స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రోహిత్ కుమార్ కుండును ఒక చోరీ కేసుకు సంబంధించి నిందితుడిగా అనుమానించిన సదరు పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో పాటు మరో ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి సదరు పోలీస్‌స్టేషన్ ఐఐసీ కేకేబీకే కుహరో తెలిపిన వివరాల మేరకు.. అక్టోబర్ 29వ తేదీన స్థానిక రింగ్ రోడ్డు సమీపంలోని ప్రభుత్వ అర్బన్ ఆస్పత్రి సమావేశ మందిరంలో చోరీ జరిగింది. దీంతో ఆస్పత్రి మెడికల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సంగ్రామ్ కిషోర్ నిమల ఈ మేరకు సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమావేశ మందిరంలోని ల్యాప్‌టాప్, సీసీటీవీకి సంబంధించిన హార్డ్‌డిస్క్‌తో పాటు మరికొన్ని కీలకమైన పత్రాలు, రిజిస్ట్రార్లు దొంగిలించబడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అర్బన్ ఆస్పత్రిలో కొంతమంది సిబ్బందిని విచారించిన అనంతరం ఈ కేసుకు సంబంధించి డాక్టర్ రోహిత్ కుమార్ కుండుతో పాటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్లుగా విధులు నిర్వహిస్తున్న అమూల్య సావుంత, దేవశీష్ గొరొడియాలను సైతం శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు.

మెడికల్ అధికారిగా విధులు

ఇదిలాఉండగా కొద్ది నెలల క్రితం డాక్టర్ కుండు అర్బన్ ఆస్పత్రిలో మెడికల్ అధికారిగా విధులు నిర్వహించారు. అయితే విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన జిల్లా కేంద్రాస్పత్రి అధికారులు డాక్టర్ మమత చౌదరి, డాక్టర్ సుబుద్ధిలు జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్‌కు సమర్పించిన నివేదిక ప్రకారం అతనిపై చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా అర్బన్ ఆస్పత్రి నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి బదిలీ చేశారు.

ఎండుతున్న పైరు..

రైతు కంటనీరు..!



గజపతి జిల్లావ్యాప్తంగా గత నెల రోజులుగా వర్షాలు కురవకపోవడంతో గుసాని సమితి కుద్దడ, రాయఘడ బ్లాక్‌లో బుర్జంగి, నువాగాం, జగన్నాథపూర్, కోరడాసింగి, నీలపూర్ గ్రామాల్లో వరిపంట ఎండిపోతోంది. దీంతో రైతులు ఖరీఫ్ పంటపై ఆశలు వదులుకున్నారు. వాస్తవానికి డిసెంబర్ నుంచి వరి కోతలు ఆరంభమవ్వాలి. కానీ ఈసారి నష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు. – పర్లాకిమిడి

బంగారు దుకాణాలు మూసివేసి నిరసన



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మూతబడిన బంగారు దుకాణాలు

జయపురం: బంగారం వ్యాపారి పెంట హరిప్రసాద్‌రావు ఆత్మహత్య చేసుకోవడానికి జీఎస్టీ అధికారుల వేధింపులే కారణమని ఆరోపిస్తూ పట్టణంలోని బంగారు వ్యాపారులంతా షాపులను మూసివేసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వి.ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇది జీఎస్టీ అధికారులు చేసిన పరోక్ష హత్య అని ధ్వజమెత్తారు. జీఎస్టీ అధికారులు అక్రమంగా దాడులు జరిపారని, ధన్వంతరి రోజున షాపులో కొనుగోలుదారులు కిక్కిరిసి ఉన్న సమయంలో 10 మంది జీఎస్టీ సిబ్బంది మూకుమ్మడిగా షాపులో ప్రవేశించి రోజంతా తనిఖీలు చేశారని మండిపడ్డారు. అంతేకాకుండా వారు అతడి ఇంటికి వెళ్లి అల్మారాలు, బీరువాలు తనిఖీ చేసి ఇంట్లో మహిళలను మానసికంగా వేధించారన్నారు. పండగ సమయంలో బాగా అమ్మకాలు ఉన్నప్పుడు దుకాణాలపై దాడులు చేస్తే అమ్మకాలు ఎలా జరుపుకోవాలని ప్రశ్నించారు. పండగల తర్వాత దాడులు చేసి తప్పుంటే శిక్షించవచ్చన్నారు. చాంబర్ కార్యదర్శి జి.మాధవ మాట్లాడుతూ.. అక్రమదాడులు నిలుపుదల చేయాలని, టాక్స్ కట్టే వ్యాపారుల ఆత్మాభిమాన్ని రక్షించాలని కోరారు. అనంతరం ఉదయం 11 గంటల సమయంలో వందలాది మంది వ్యాపారులు జీఎస్టీ కార్యాలయానికి నిరసన నినాదాలు చేస్తూ వెళ్లారు. వారితో పాటు జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ర్యాలీలో పాల్గొన్నారు. వ్యాపారుల తరపున జీఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. తమ అసోసియేషన్ వ్యాపార దుకాణాలపై అధికారుల దాడులకు వ్యతిరేకం కాదని, అయితే పండగల సమయాల్లో చేయడం సరికాదన్నారు.

రైలు ఢీకొని ఏనుగు మృతి



పట్టాల పరిసరాల్లో ఏనుగు కళేబరం

భువనేశ్వర్: ఆహార అన్వేషణలో ఏనుగులకు రక్షణ లేకుండా పోతోంది. రాష్ట్రంలో తరచూ ఏనుగుల సంతతి దుర్మరణం పాలవుతోంది. ఆహార అన్వేషణ సన్నాహాల్లో ఏనుగులు విద్యుదాఘాతం లేదా రైలు ఢీకొన్న ప్రమాదాల్లో తరచూ ప్రాణాలు కోల్పోతున్నాయి. తాజాగా శుక్రవారం అర్ధరాత్రి పూట మరో ఏనుగు దుర్మరణం పాలైంది. ఢెంకనాల్, అంగుల్ మధ్య రైలు మార్గం దాటుతుండగా సరుకు రవాణా రైలు ఢీకొనడంతో ఈ ఏనుగు మరణించినట్లు ప్రాథమిక సమాచారం. ఈ మార్గంలో మెరామండల్ రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాల పరిసరాల్లో ఏనుగు కళేబరం స్థానికులు గుర్తించారు. అటవీ శాఖ, స్థానిక పోలీసుల ఘటనా స్థలం ప్రత్యక్షంగా సందర్శించి ఏనుగు మరణంపై ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దారుణం

- చేతబడి నెపంతో ఒకరి హత్య



మృతుడు భీమ నాయిక్ (ఫైల్)



అరెస్టైన భగవాన్, బలరాంలు



మృతదేహం కోసం తవ్వుతున్న గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలో చేతబడి అనుమానంతో ఒక వ్యక్తిని హత్య చేసి పాతిపెట్టిన ఘటన 10 రోజుల తర్వాత బయటపడింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని తవ్వి బయటకు తీశారు. మృతుడు బొయిపరిగుడ సమితి బొదాపుట్ పంచాయతీ నువాగుడ గ్రామానికి చెందిన భీమ నాయిక్‌గా గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో అదే గ్రామానికి చెందిన భగవాన్ గదబ, బలరాం ముండగుడియల ఉన్నట్లు పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ శనివారం వెల్లడించారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఇదీ జరిగింది..

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం భీమ నాయిక్‌ను దొరాపుట్ పంచాయతీ గొదొరగుడ గ్రామానికి చెందిన కొంతమంది పిలవడంతో వెళ్లాడు. ఆ గ్రామంలోని కళాకారులు కొత్త నాటకం ప్రాక్టీస్ చేసేముందు పూజ కోసం అతడిని పిలిచారు. దీంతో ఆ గ్రామం వెళ్లిన భీమ నాయిక్ రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. అయితే ఏదో పని ఉండి రాత్రి ఇంటికి రాలేకపోయాడేమోనని కుటుంబ సభ్యులు భావించారు. మరుసటి రోజు కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు గొదొరగుడ గ్రామానికి వెళ్లి గ్రామస్తులను భీమ నాయిక్ గురించి అడిగారు. అయితే అతడు రాత్రే వెళ్లిపోయాడని వారు చెప్పడంతో చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లోనూ గాలించారు. కానీ అతడి జాడ తెలియకపోవడంతో ఈనెల 29వ తేదీ రాత్రి భీమ నాయిక్ భార్య దినాయె నాయిక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అతడిని హత్య చేసి ఉంటారనే క్లూ లభించడంతో ఆ దిశలో దర్యాప్తు ముమ్మరం చేశారు. భీమ నాయిక్‌ను హత్య చేశారని స్పష్టం కావడంతో గ్రామంలోని 18 మంది వ్యక్తులను విచారించారు. అనంతరం బలరాం ముండగుడియ, భగవాన్ గదబలను అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి తమదైన శైలిలో విచారించగా విషయం బయటపడింది. దీంతో జయపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి వర్మ, సైంటిఫిక్ టీమ్, బొయిపరిగుడ పోలీసులు వారితో భీమ నాయిక్‌ను హత్య చేసి పాతిపెట్టి ప్రాంతానికి వెళ్లారు. నిందితులు భీమను ఎలా చంపింది వెల్లడించారు. మొదట భీమ నాయిక్‌ను కొట్టి రాయితో చితకబాది హత్య చేసి, తర్వాత గొడ్డలితో శరీరం నుండి తల వేరు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పర్వతంపై గొయ్యి తీసి అందులో పాతి పెట్టినట్లు తెలిపారు. తదుపరి తలను కాల్చి మరికొంత దూరంలో పాతిపెట్టినట్లు చెప్పారు. భీమ చేతబడితో గ్రామంలో ప్రజలు, పశువులను చంపుతున్నాడని, పంటలను నష్ట పరుస్తున్నాడని అందుకే అతడిని చంపినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసు అధికారి తెలిపారు. ఒక సంవత్సరం నుంచి భీమ నాయిక్‌ను చంపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆ ఇద్దరినీ అరెస్టు చేసి కేసి నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

భువనేశ్వర్‌లో బాంబుల అలజడి



బాంబుల దాడి జరిగిన ప్రాంగణం

భువనేశ్వర్: నగరంలో శుక్రవారం అర్ధరాత్రి తీవ్ర అలజడి రేగింది. రాత్రిపూట అకస్మాతుగా బాంబుల పేలుడు స్థానికులను బెంబేలెత్తించింది. స్థానిక సాహిద్ నగర్ ప్రాంతం విన్నర్ అసోసియేషన్ భవనం ఆవరణలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనా స్థలం పరిసరాల్లో సీసీటీవీ ఫుటేజీ దృశ్యాలు అత్యంత భయానక దాడిగా స్పష్టం చేస్తున్నాయి. దాడిలో సుమారు 30 నుంచి 40 మంది ఆగంతకులు పాల్గొన్నట్లు ఈ దృశ్యాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ దాడిలో ఒక కారు, ఒక బైక్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. సాహిద్ నగర్ థాణా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

తగ్గిన దృశ్య మాన్యత


దట్టమైన పొగ అలముకున్న దృశ్యం

భువనేశ్వర్: జంట నగరాల్లో దీపావళి బాణసంచా విపరీత ప్రభావం చూపింది. బాణసంచా పేలుడుతో వాయు వాతావరణం కలుషితమైంది. దీని ప్రభావంతో కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో శనివారం తెల్లవారిపూట దట్టమైన పొగమంచు కమ్మిన వాతావరణం తారసపడింది. విపరీత దిశలో దూసుకు వస్తున్న వాహనాలు, వ్యక్తుల జాడ గుర్తించడం కష్టతరంగా మారింది. సుమారు 100 మీటర్ల దూరం వరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో జంట నగరాల్లో సాధారణ జనజీవనం ప్రభావితమైంది. ఇదే పరిస్థితి పూరీ పట్టణంలోనూ తారసపడింది. శీతాకాలం ఆగమనంతో పొగమంచు కమ్మినట్లు సాధారణ ప్రజానీకం అభిప్రాయపడింది. బాణసంచా పేలుడుతో చోటు చేసుకున్న కాలుష్య ప్రభావంతో తాత్కాలికంగా ఏర్పడిన పర్యావరణ పరిస్థితిగా వాతావరణ నిపుణుల వర్గం అభిప్రాయపడింది.

మో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్


బస్సుని అడ్డుకొని ఆందోళన చేస్తున్న స్థానికులు

భువనేశ్వర్: మో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో నగరంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక చంద్రశేఖరపూర్ పెట్రోలు బంకు ప్రాంతంలో శనివారం జరిగిన ఈ ఘటనలో ఒక మైనర్ బాలిక ఎడమ చేయి కోల్పోగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో వీరిరువురూ చికిత్స పొందుతున్నారు. ఆగ్రహించిన స్థానికులు ప్రమాదానికి కారణమైన మో బస్సుని అడ్డుకుని ఆందోళనకు దిగారు. దీంతో జయదేవ్ విహార్ నుంచి నందనకానన్ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారు మూడున్నర గంటలపాటు నిరవధికంగా కొనసాగిన ఈ ఆందోళన ప్రభావంతో డ్రైవరుని పోలీసులు అదుపులోకి తీసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఆమదాలవలస : మండలంలోని దివంజిపేట జంక్షన్ సమీపంలో అలికాం బత్తిలి ఆర్‌అండ్‌బీ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామానికి చెందిన జె.యర్రన్నాయుడు గాయపడ్డాడు. ఆమదాలవలస నుంచి తన ద్విచక్రవాహనంపై టీవీ కొనుగోలు చేసుకొని తీసుకువెళ్తుండగా ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బాధితుడిని 108లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బస్సును ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు. కేసు నమోదు చేయాల్సి ఉందని ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

రేపు మహిళా కళాశాలలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాబ్‌మేళాలో నాలుగు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఒరిజినల్ టీసీతో హాజరుకావాలని, వివరాలకు 94928 84824 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురు మృతి, మరో ముగ్గురి పరిస్థితి విషమం


దుర్ఘటన పాలైన మ్యాజిక్ వాహనం


రోడ్డుపై మృతదేహాలు

భువనేశ్వర్: సుందరగడ్ జిల్లాలో శనివారం వేకువజామున 2.30 గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 7 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. సుందరగడ్ జిల్లా గయి కొనాపల్లి గ్రామం ఎంసీఎల్ – టొపారియా రోడ్ ప్రాంతంలో ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన నిలబడి ఉన్న ట్రాలర్‌ని వెనుక నుంచి మ్యాజిక్ వ్యాన్ బలంగా ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక అంచనా. వివరాల్లోకి వెళ్తే.. కొందాధుడొ, సమరపిండా ప్రాంతాల నుంచి 10 మంది సభ్యుల సంకీర్తన మండలి మ్యాజిక్ వ్యాన్‌లో ఛత్తీస్‌గఢ్ చొక్కాబొహాల్ ప్రాంతానికి ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో 6 మంది సభ్యులు ఘటన స్థలంలోనే మరణించారు. మృతుల్లో డ్రైవర్ ఒకరుగా గుర్తించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం చేరువలో ఉన్న హేమగిర్ ఆస్పత్రిలో చేర్చారు. వీరిలో ఒక వ్యక్తి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. దీంతో మృతుల సంఖ్య 7కి చేరింది. మిగిలిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల వివరాలు తెలియలేదు.

జవాన్లకు దోమ తెరల పంపిణీ


జవాన్లకు దోమ తెరలను అందిస్తున్న కలెక్టర్ పట్వారి తదితరులు


కార్యక్రమంలో పాల్గొన్న జవాన్లు

రాయగడ: స్థానిక రాయగడ కళాశాల ప్రాంతంలోని సీఆర్పీఎఫ్ 4వ బెటాలియన్ జవాన్లకు కలెక్టర్ పట్వారీ శనివారం దోమ తెరలను పంపిణీ చేశారు. జిల్లా స్వాస్థ సమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశం కోసం ఆహర్నిశలు శ్రమిస్తున్న జవాన్ల ఆరోగ్య భద్రత మనందిరిపై ఉందన్నారు. వ్యాధులను అదుపు చేసేందుకు ప్రభుత్వం జిల్లాకు 6.37 లక్షల దోమ తెరలను మంజూరు చేసిందని తెలిపారు. ఈ దోమ తెరలను సంబంధిత శాఖ అధికారులు సక్రమంగా పంపిణీ చేయడంతో పాటు వీటిని సద్వినియోగ పరిచేలా ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తే వ్యాధులు అదుపులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, ఏడీఎంవో(పబ్లిక్ హెల్త్) డాక్టర్ మమత చౌదరి, సీఆర్పీఎఫ్ 4వ బెటాలియన్ 2వ కమాండెంట్ ప్రభాకర్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

గీతాజయంతి పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు డిసెంబర్ 11న భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీతలోని ఆరో అధ్యాయం ఆత్మసంయమన యోగంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6,7 తరగతులు మొదటి గ్రూపుగా, 8, 9,10 తరగతులు రెండో గ్రూపుగా, 18 అధ్యాయాలు పూర్తిగా వచ్చినవారికి మూడో గ్రూపుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9866914160 నంబరును సంప్రదించాలని కోరారు.

భావనపాడు జెట్టీ పరిశీలన

సంతబొమ్మాళి: మండలంలోని భావనపాడు జెట్టీ(తీర ప్రాంతం)ని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ (ఎన్‌సీసీఆర్) శాస్త్రవేత్త సుధీర్ శనివారం సందర్శించారు. సముద్ర ముఖద్వారం వద్ద ఇసుక మేటలను పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడి ఇసుక మేటల సమస్యను సాంకేతికంగా పరిష్కరించేందుకు నివేదిక అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసరావు, ఏడీ సత్యనారాయణ, టెక్కలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజ్‌పాత్రో, ఫిషరీస్ అసిస్టెంట్ ఎల్.దామోదర్, సాగరమిత్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిసెంబర్ 18 నుంచి గజపతి ఉత్సవాలు


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: డిసెంబర్ 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గజపతి ఉత్సవాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్, ఉత్సవ కమిటీ చైర్మన్ బిజయ కుమార్ దాస్ తెలియజేశారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం హాల్‌లో గజపతి ఉత్సవాల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. పవిత్ర మహేంద్రగిరి నుంచి మసాల్ యాత్ర 18న బయల్దేరి రాయఘడ మీదుగా పర్లాకిమిడి చేరుకుంటుంది. ఈ ఉత్సవాల్లో ఐదు రోజుల పాటు పల్లెశ్రీ మేళా స్టాల్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధీనంలో ఉన్న ఓర్మాస్ అధికారులు తెలియజేశారు. వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు రప్పించి రోజూ సాయంత్రం ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ దాస్ అన్నారు. అనంతరం ఉత్సవాలకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, డీఎస్పీ చంద్రశేఖర హోత్తా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, కోశాధికారి అనాది పాణిగ్రాహి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సమస్యలు కొలిక్కి వచ్చేనా?

- నేడు జిల్లాకు శాప్ చైర్మన్ రాక
- జీతాల కోసం ఎదురుచూస్తున్న డీఎస్‌ఏ కోచ్‌లు


నత్తనడకన సాగుతున్న కోడిరామ్మూర్తి స్టేడియం పనులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదివారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో జరగనున్న 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి పాల్గొంటారు. అనంతరం కేఆర్ స్టేడియంతో జరుగుతున్న పనులతోపాటు నరసన్నపేట క్రీడా వికాస కేంద్రాన్ని సందర్శించనున్నారు. క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, కోచ్‌లతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అనంతరం క్రీడాసంఘాలతో సమావేశమౌతారని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు పేర్కొన్నారు.

సమస్యలపై దృష్టిసారించాలి..

అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే కోడిరామ్మూర్తి స్టేడియాన్ని పూర్తిచేస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వ పాలకులు ఇప్పటికీ సగం రోజులు పూర్తయినా.. కనీసం 30 శాతం పనులు కూడా పూర్తికాలేదు. క్రీడల ఖిల్లాగా పేరొందిన శ్రీకాకుళంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ అవసరమని క్రీడాసంఘాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. జిల్లాలో ఉన్న క్రీడావికాస కేంద్రాల నిర్వహనకు కనీస నిధులు లేవు. అక్కడ పూర్తిస్థాయిలో కోచ్‌లు అందుబాటులో ఉండటంలేదు. ఒకరో ఇద్దరో ఉన్నప్పటికీ కనీస మౌళిక సదుపాయాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. శాప్ కోచ్‌లు, డీఎస్‌ఏ పరిధిలో ఉన్న కోచ్‌లకు రెండు నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. గుర్తింపు లేని సంఘాలు పుట్టగొడుల్లా విస్తరిస్తున్నాయి. క్రీడాసంఘాలకు నిధులు కేటాయింపు కావడంలేదు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధిస్తే తప్ప.. క్షేత్రస్థాయిలో క్రీడాకారులకు కనీస ప్రోత్సాహకం, గుర్తింపు ఉండటంలేదు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహణ ఊసే లేకుండా పోయింది.

మూడు వాహనాలు ఢీ

- ఐదుగురు విద్యార్థినులకు గాయాలు

నరసన్నపేట: జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై జమ్ము కూడలిలోని అయ్యప్ప హోటల్ వద్ద శనివారం మూడు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ముందుగా టెక్కలి వైపు నుంచి నరసన్నపేట వస్తున్న మార్గంలో టాటా మ్యాజిక్ వాహనాన్ని కారు ఢీ కొట్టింది. దీంతో టాటా మ్యాజిక్ వాహనం ముందున్న మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో డిగ్రీ, ఇంటర్మీడియెట్ చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు హిమబిందు, రమణమ్మ, ఆసిని, మమత, రేణుకలకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బామ్మ గారు.. ఇరగదీస్తున్నారు

- ఏడు పదుల వయసులో రీల్స్ చేస్తున్న బామ్మ
- హీరో, విలన్స్ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేస్తున్న వృద్ధురాలు


బామ్మ అప్పలమ్మ



ఏ కల్మషం లేని స్వచ్ఛమైన మనసు.. ఏ ఆర్భాటం లేని అచ్చమైన సిక్కోలు వర్చస్సు.. కలగలిపితే కర్రి అప్పలమ్మ. ఓ రోజు చిరంజీవిలా, మరో రోజు ప్రభాస్‌లా, ఇంకోరోజు మహేష్ బాబులా.. అప్పలమ్మ డైలాగులు చెబుతుంటే కళ్లప్పగించి సెల్ చూడాల్సిందే. ఊరికే పేరు చెబితే గుర్తు పట్టలేరేమో గానీ.. ఆమె రీల్స్ చూస్తే మాత్రం మర్చిపోలేరు. మనవడితో కలిసి నెట్టింట అప్పలమ్మ చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. సినిమాల్లో ఫేమస్ డైలాగులను చెబుతూ తెగ అలరిస్తున్నారు. సరదాగా మొదలుపెట్టిన ఈ ప్రయత్నం ఆమెకు ఖ్యాతిని తెచ్చి పెడుతోంది.


మనవడితో కలిసి రీల్స్ షూటింగ్‌లో అప్పలమ్మ

ఇచ్ఛాపురం రూరల్/కవిటి:

'వయొలెన్స్.. వయొలెన్స్.. వయొలెన్స్..' అని రాకీ భాయ్ స్టైల్‌లో బామ్మ చెబుతుంటే చూసి నవ్వుకోని వారంటూ ఉండరు. 'అన్నయ్యా.. ఈ తొక్కలో మీటింగేంటో అర్థం కావడం లేదు' అని పండుగాడిని అనుకరిస్తూ చెబితే ఆనందించని మహేష్ బాబు ఫ్యాన్ ఉండడు. 'టాయిలెట్స్ ఎక్కడున్నాయో నన్నడుగుతున్నావేండి సుధా వీడు' అని కోపంగా బామ్మ అంటుంటే లైక్ కొట్టకుండా ఉండలేరు. సామాజిక మాధ్యమం వేదికగా ఇంటిల్లిపాదినీ అలరిస్తున్నారు కర్రి అప్పలమ్మ. యూట్యూబ్‌లో సొంతంగా ఒక వేదికను ఏర్పాటు చేసుకుని చక్కటి కంటెంట్ క్రియేట్ చేస్తున్నారు. కవిటి మండలం పెద్ద కర్రివానిపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన కర్రి అప్పలమ్మ అంటే ఇప్పుడు ప్రపంచమంతా పరిచయమే. బడి ముఖం కూడా చూడని అప్పలమ్మ ఇప్పుడు జిల్లా అంతా ఫేమస్ అయిపోయారు. తన మనవడు, అతడి స్నేహితులతో కలిసి 125 వరకు రీల్స్ చేశారు.

జీవితమంతా కష్టపడి..

కర్రి అప్పలమ్మ జీవితమంతా ముళ్లబాటలోనే సాగింది. చిన్నతనంలో పెళ్లి చేసుకొని సముద్రం నుంచి భర్త తెచ్చిన చేపల్ని ఊరూరా అమ్ముతూ ఇద్దరు కొడుకులు, ఒక కూతురికి పెళ్లిళ్లు చేసింది. అస్వస్థతతో ఇంటి పట్టునే కుటుంబసభ్యులతో ఉంటోంది. కరోనా సమయంలో బడికి సెలవులు ఇవ్వడంతో మనవడు కర్రి శివ తన స్నేహితులతో సరదాగా మొబైల్‌లో ఫైట్స్ సీన్స్ చేసి యూట్యూబ్ చానెల్స్‌లో, వాట్సాప్‌లో అప్‌లోడ్ చేశావాడు. అనుకోకుండా ఒకరోజు అప్పలమ్మతో సరదాగా ఫైట్ సీన్ చేయాలని అనుకున్నారు. అనుకున్నది తడవుగా శివ తన నాన్నమ్మను ఒప్పించాడు. కేజీఎఫ్ సినిమాలోని 'వయలెన్స్ వయలెన్స్ ఐ డోంట్ లైక్ ఇట్' కామెడీ సీన్ చేసేందుకు స్నేహితులు సాధూరు బాలు, సాధూరు నానితో కలిసి ప్లాన్ చేశాడు. పలుమార్లు వీడియో చూపించి అచ్చం అదే మాదిరిగా పెదవులు కదుపుతూ నటించమన్నారు. అంతే బామ్మ అప్పలమ్మ నటించడం బదులు ఆ సీన్‌లో జీవిస్తూ కామెడీ సీన్‌ను పండించింది. ఈ సన్నివేశాన్ని ముగ్గురు స్నేహితులు 'అప్పుబాలు అఫీషియల్' యూట్యూబ్ చానెల్‌ను ఏర్పాటు అందులో అప్‌లోడ్ చేశారు. అంతే వారం రోజుల్లో 30వేల మంది ఈ వీడియోను చూసి మెచ్చుకున్నారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న ఈ ముగ్గురు స్నేహితులు 2020 నుంచి 24 వరకు అప్పలమ్మచేత 125 వరకు రీల్స్ చేసి, లక్షకు పైగా వ్యూస్‌ను సంపాదించుకున్నారు.

అలవోకగా పరకాయ ప్రవేశం..

ఇంద్ర సినిమాలో చిరంజీవిలా, ఛత్రపతిలో ప్రభాస్‌లా, పుష్పలో అల్లు అర్జున్‌లా, మగధీరలో రామ్ చరణ్‌లా, అపరచితుడులో విక్రమ్‌లా... ఇట్టే ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేస్తోంది అప్పలమ్మ. ఛత్రపతి, మగధీర, మిర్చి, అపరిచితుడు, సరైనోడు, పోకిరి, విక్రమార్కుడు, కాంచన, ఇంద్ర, బిజినెస్‌మెన్, మాస్టర్, రాయన్, సరిపోదా శనివారం చిత్రాల డైలాగులు తన నాన్నమ్మకు మంచి పేరుతో పాటు అధిక వ్యూస్ తెచ్చిపెట్టాయని శివ చెబుతున్నాడు. ఈ సందర్భంగా అప్పలమ్మ 'సాక్షి'తో మాట్లాడుతూ మొదట్లో నటించేందుకు భయపడ్డానని, అయితే తాను నటించిన వీడియోలో నా నటనను తానే చూసుకొని మురిసిపోయేదాన్నని, గ్రామస్తులతో బంధువులు సైతం మెచ్చుకోవడంతో కష్టమైనా నటించేందుకు నా మనవళ్లతో వెళ్తుంటానని చెబుతోంది. దాతలు ముందుకు వచ్చి తమకు సహాయంగా నిలిస్తే లఘు చిత్రాలు తీసేందుకు సిద్ధంగా ఉన్నామని శివ, బాలు, నాని చెబుతున్నారు.

జైలు వార్డర్ అనుమానాస్పద మృతి


సంఘటన స్థలం వద్ద విచారణ బృందం

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లాలో జైలు వార్డర్ అనుమానాస్పద మృతి శనివారం తీవ్ర కలకలం రేపింది. కేంద్రాపడా జిల్లా బొరిమూలో కారాగారం బ్యారక్‌లో జైలు వార్డర్ మృతదేహం వేలాడుతున్నట్లు గుర్తించారు. పరిసరాల దృష్ట్యా ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. కుటుంబీకులు హత్య జరిగి ఉంటుందని ఆరోపిస్తున్నారు. మృతుడు బిజయ్ పరిడాగా గుర్తించారు. అతని స్వస్థలం కటక్ జిల్లా అలొగొడా గ్రామం. బిజయ్ పరిడా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో స్వగ్రామం నుంచి తిరిగి వచ్చి బ్యారక్‌కు చేరాడు. తోటి సిబ్బంది విధులు ముగించుకుని రాత్రి బ్యారక్ చేరే సమయంలో సీలింగ్ ఫ్యానుకు అతని మృతదేహం వేలాడుతున్నట్లు గుర్తించారు. విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమాచారం మృతుని కుటుంబీకులకు తెలియజేశారు. జైలు అధికార వర్గాలు, మృతుని కుటుంబీకులు హుటాహుటిన ఘటనా స్థలం చేరారు. కేంద్రాపడా సదరు థాణా పోలీసులు సైంటిఫిక్ బృందంతో కలిసి ఘటనా స్థలం సందర్శించి విచారణ ప్రారంభించారు.

అవినీతికి అడ్డుకట్ట వేయాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: ప్రతి ఒక్కరూ అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి అవినీతి నిరోధక అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి తగ్గితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ తపన్ నారాయణ్ రౌత్, అవినీతి నిరోధక శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ సదానంద్ మణి, డిప్యూటీ కలెక్టర్ దుర్యోధన్ బోయి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ దివంగతులకు శ్రద్ధాంజలి


అలంకరించిన శ్మశానవాటికలు

భువనేశ్వర్: క్రైస్తవ కుటుంబీకులు దివంగతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఖుర్దారోడ్ (జట్నీ) క్రైస్తవ శ్మశాన వాటికలో ఆత్మీయుల ఆత్మశాంతి కోసం క్రైస్తవ వర్గీయులు సామూహికంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్మశానవాటికలో సమాధులకు సుగంధిత పుష్పాదులతో అలంకరించి గుభాళింపజేశారు. ఆల్ సోల్స్ డే కార్యక్రమంగా ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ సంప్రదాయమని క్రైస్తవ శ్మశాన వాటిక సంఘం అధ్యక్షుడు ఎస్.జాన్ తెలిపారు.

క్లుప్తంగా

'గురజాడ' విజేతలు వీరే...



విజేతలైన విద్యార్థులతో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం గురజాడ స్వగృహంలో విద్యార్థులకు వక్తృత్వం పోటీలు ఫైనల్స్ నిర్వహించారు. గత నెల 28న ప్రాథమిక పోటీల్లో ఎంపిక చేసిన 18 మంది విద్యార్థులకు ఫైనల్స్ నిర్వహించారు. లక్ష్మీప్రసన్న, దివ్యవర్షిణి, ఎస్.జ్యోతి వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఆశాభవాని, దీపశ్రీ కన్సోలేషన్ బహుమతులను గెలుచుకోగా, కె.శరణ్య ప్రత్యేక బహుమతిని గెలుచుకుంది. న్యాయ నిర్ణేతలుగా సాహితీవేత్త డాక్టర్ ఎ.గోపాలరావు, కవి, విమర్శకుడు కిలపర్తి దాలినాయుడు వ్యవహరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, డాక్టర్ జక్కు రామకృష్ణ, గురజాడ ఇందిర, భోగరాజు సూర్యలక్ష్మి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ఇప్పిలి అప్పలరాజు

పార్వతీపురం టౌన్: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఇన్‌చార్జి తెలిపిన వివరాలు... బలిజిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఇప్పిలి అప్పలరాజు(64) కూనేరు సంతకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేపడతామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



రైలు ట్రాక్ పక్కన శివ మృతదేహం


పార్వతీపురం టౌన్: తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఇన్‌చార్జి రత్నాకర్ తెలిపిన వివరాలు... వీరఘట్టం మండలం తూడి గ్రామానికి చెందిన కొనిశ శివ(27) తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి శనివారం రూరల్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా పద్మనాభ మండలం సత్యన్నారాయణపురం గ్రామానికి చెందిన రౌతు నారాయణ (35) అప్పుల బాధలు తాళలేక శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో చాకలిపేట లేఅవుట్‌లో పురుగుల మందు సేవించాడు. పరిస్థితిని గమనించిన స్థానికులు 108 సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నారాయణ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దత్తత తర్వాత కూడా పర్యవేక్షణ చేయాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి విజయకల్యాణి



శిశుగృహలో శిశువును పరిశీలిస్తున్న విజయకల్యాణి

విజయనగరం ఫోర్ట్: పిల్లలను దత్తత ఇచ్చిన తర్వాత కూడా వారిని దత్తత తీసుకున్న తల్లిదండ్రులు ఏ విధంగా చూసుకుంటున్నారో.. పర్యవేక్షణ చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.విజయకల్యాణి అన్నారు. స్థానిక కె.ఎల్.పురంలో ఉన్న శిశుగృహను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసారు. దత్తత ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎటువంటి ఆహారాన్ని ఇస్తారని అడిగి తెలుసుకున్నారు. దత్తత తీసుకున్న పిల్లలను ఎవరైనా బెగ్గింగ్ వంటి వాటికి వినియోగిస్తున్నారా.. అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిశుగృహ మేనేజర్ జి.త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

గాడి తప్పిన గ్రామ స్వరాజ్యం

రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం నిర్మించిన గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ లేకుండా చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నీరుగార్చేలా చేస్తోంది. సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేసి వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. దీంతో గ్రామ స్వరాజ్యం గాడి తప్పి పాలన అస్తవ్యస్తంగా తయారవుతోంది.

- పాలన అస్తవ్యస్తం – నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- గతంలో అందుబాటులో 545 సేవలు
- నేడు గందరగోళం
- పింఛన్‌కు పరిమితమైన సచివాలయ ఉద్యోగులు
- ప్రభుత్వ సేవలందక గ్రామీణుల అవస్థలు



రామభద్రపురంలో ఏర్పాటు చేసిన సచివాలయం - 2, రైతు సేవా కేంద్రం

రామభద్రపురం : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. ఇందులో భాగంగానే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. తద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థలకు తూట్లు పొడిచి పక్కాగా నిర్వీర్యం చేస్తోంది. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు ఈ వ్యవస్థలు ఎంతగానో దోహదపడ్డాయి. ప్రజలకు చేరువయ్యాయి. గ్రామాల్లో ప్రజలకు ఏ పని కావాలన్నా సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీరే చేసి పెట్టేవాడు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు చేరేవి. ప్రస్తుతం కూటమి పాలనలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. జగనన్న పాలనలో జిల్లాలో 626 సచివాలయాలు ఏర్పాటు చేసింది. వీటి పరిధిలో 510 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సచివాలయాల ద్వారా 545 సేవలు ప్రజలకు అందేవి. నేడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పాలనంతా గందరగోళంగా తయారైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు ఇంతవరకు తెరుచుకోలేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నాడు కలకల. నేడు వెలవెల..

గత ప్రభుత్వం రెండు వేల జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసింది. కొన్ని నెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు.. లబ్ధిదారుల రాకపోకలతో కలకలలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. నేటికీ ప్రభుత్వ వెబ్‌సైట్లు తెరుచుకోకపోవడంతో నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి అర్హత ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల్లోని సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో అర్హులు వెళ్తున్నారు. నూతన పెన్షన్లు కోసం ప్రభుత్వ వెబ్‌సైట్ తెరవకపోవడంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. దీంతో పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు సచివాలయ ఉద్యోగులకు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకే పరిమితమైపోయారు.

రెండు వారాల్లో ఓపెన్ అవుతాయని సమాచారం

సచివాలయాల్లో పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తుకు వెబ్‌సైట్లు ఇంకా ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నూతన నియమ నిబంధనలు తయారు చేస్తోంది. ఈ నెల రెండో వారంలో వెబ్‌సైట్లు ఓపెన్ అవుతాయనే సమాచారం ఉంది. ప్రభుత్వం దరఖాస్తుకు అనుమతి ఇచ్చినప్పుడు వెంటనే అమలయ్యేలా చూస్తాం. సచివాలయాల ఉద్యోగుల వినియోగంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

– ఎం.కిరణ్‌కుమార్, డీఎల్‌డీఓ, బొబ్బిలి డివిజన్

సచివాలయ ఉద్యోగులే దిక్కు..

కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగుల పట్ల వివక్షతో అనేక విమర్శలు చేశారు. అవమానంగా మాట్లాడారు. నేడు కూటమి సర్కార్‌కు పింఛన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్దదిక్కయ్యారు. ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించే దగ్గర నుంచి ఇంటింట ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. గతంలో ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వారిని పక్కనపెట్టి సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయిస్తోంది. వీరు ఒకటో తేదీన 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంత కీలకం అనేది జగమెరిగిన సత్యం.

పశువుల అక్రమ రవాణాను సహించేది లేదు..

- పశు సంవర్ధక శాఖ జేడీ రమణ



సంతలో పశువులు కుండీలను పరిశీలిస్తున్న జేడీ వైవీ రమణ

దత్తిరాజేరు: జిల్లాలో పశువుల అక్రమ రవాణాకు ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, అలా చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవీ రమణ హెచ్చరించారు. పెదమానాపురం పశువైద్యాధికారి దినేష్ ఆధ్వర్యంలో సంతలో పశువుల వ్యాపారులకు రవాణాపై శనివారం అవగాహన కల్పించారు. ఆవులు అక్రమ రవాణా నిలిపివేశామని, చిన్న వ్యాన్లలో రెండు నుంచి మూడు పశువులు, మినీ వ్యాన్లలో నాలుగు నుంచి ఆరు పశువులు మాత్రమే తరలించాలని అన్నారు. అనారోగ్యం పాలైన పశువులను కబేళాలకు తరలించాలని ఏ ఒక్క వ్యాపారికి అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, మార్కెటింగ్, పంచాయతీ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని జేడీ తెలిపారు. తక్కువ ఆశీలు వసూలు చేసి సంత యజమానులు అన్ని సౌకర్యాలు కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. సంతలో సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏజేడీ చంద్రశేఖర్, సంత నిర్వాహకులు రామునాయుడు, తిరుపతినాయుడు, గోవింద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ దుకాణాలపై కొనసాగుతున్న తనిఖీలు



బాణసంచా విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ విభాగం ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు

విజయనగరం: జిల్లా కేంద్రంలో గల కెఎల్.పురం ప్రాంతంలో ఉన్న పలు హోల్‌సేల్ బాణసంచా విక్రయ దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు శనివారం కూడా తనిఖీలు కొనసాగించారు. దుకాణాల్లో విక్రయాలకు ఉంచిన పలు కంపెనీల ఉత్పత్తులను పరిశీలించారు. కొన్నింట్లో లోపాలున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో భాగంగా మూడు షాపులతో పాటు మూడు కంపెనీలపై కేసులు నమోదు చేసి సామగ్రిని సీజ్ చేశారు. ప్యాకెజీలపై తయారీ తేదీలు లేకపోవటం, విక్రయ ధర లేకపోవటం, ప్రత్యేక స్టిక్కర్ అంటించడం, కంపెనీ చిరునామాలు లేనట్లు గుర్తించి సీజ్ చేసినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదరనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులతో ఆయన మాట్లాడుతూ ఇటువంటి లోపాలున్న ఉత్పత్తుల విక్రయానికి ఉంచరాదని సూచించారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన దుకాణాలు



దుకాణాల్లో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న స్థానికులు

భామిని: మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు దుకాణాలు కాలిపోయాయి. ఒక్కసారిగా మంటలు పెద్దెత్తున రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాలనీలో ఉన్న దుకాణ సముదాయంలో ఓ దుకాణంలో వెలిగించిన దీపం అక్కడి డోర్‌కర్టెన్‌కు అంటుకొని మంటలు రేగాయని భావిస్తున్నారు. మంటలు క్షణాల్లోనే పక్క దుకాణాలకు వ్యాపించడంతో స్థానికులు చేరుకొని మంటలను అదుపు చేశారు. పెద్దెత్తున మంటలు చెలరేగడానికి దుకాణాల్లో ఉన్న డీజిల్, పెట్రోల్ బాటిళ్లు కారణమని భావిస్తున్నారు. ప్రమాదంలో దుకాణాల్లోని ప్లంబింగ్ సామగ్రి, స్పేరు పార్టులు కాలిపోయాయి. మూడు దుకాణాల్లో రెండు పూర్తిగా కాలిపోగా, ఒక దుకాణంలో పాక్షికంగా కాలిపోయింది. దుకాణాల ముందున్న వ్యాన్ కూడా పాక్షికంగా కాలిపోయింది. సమీపంలోనే విద్యుత్ వైర్లు ఉండడంతో షార్ట్ సర్క్యూట్‌కు గురై మూడు ఇళ్లల్లోని విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా దగ్ధమయ్యాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం ఉంటుందని బాధిత కుటుంబాలు వారు విలపిస్తూ చెప్పారు.

6 నుంచి దృష్టిలోప నిర్ధారణ పరీక్షలు

పార్వతీపురం: జిల్లాలో కంటి వెలుగు కింద చేపడుతున్న దృష్టి లోప నిర్ధారణ పరీక్షలను ఈ నెల 6 నుంచి నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపై ఎంపీడీఓలతో తన కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ శనివారం సమీక్షించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ రూపొందించిన ముందస్తు ప్రణాళికలలో భాగంగా ముందుగా సీతంపేట, గుమలక్ష్మీపురం, సాలూరు, పాచిపెంట, జియమ్మవలస, కొమరాడ మండలాల్లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సచివాలయాల్లో నవంబర్ 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 20 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలోని 15 ఏళ్లు దాటిన వారందరికీ వైద్యులు కంటి పరీక్షలను నిర్వహించి, వారికి అవసరమైన సూచనలు చేయడంతో పాటు అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా చేపట్టాలన్నారు. ఒక్కో సచివాలయం నుంచి కనీసం రోజుకు 20 మంది పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా.ఎం.వినోద్, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.



రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రతి ప్రాంతం పరిశుభ్రం కావాలి

పార్వతీపురం టౌన్: పట్టణంలో ప్రతి ప్రాంతంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొనాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. 'స్వచ్ఛ సుందర పార్వతీపురం' కార్యక్రమంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. రూరల్ పోలీస్‌స్టేషన్, దుర్గమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ముందుగా ఆహ్లాదకర వాతావరణం నెలకొనాలని ఆయన పేర్కొన్నారు. కార్యాలయాల వద్ద ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాలని ఆయన చెప్పారు. ప్రతీ కార్యాలయంలో మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. పలు ముఖ్య కూడళ్లలో అందమైన ఆకృతులను ఏర్పాటు చేసి పట్టణానికి మరింత శోభను చేకూర్చాలని అన్నారు. మున్సిపల్ డీఈ జట్టు పారి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ యూనివర్సిటీ పోటీలకు సత్య విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: జమ్ముకశ్మీర్‌లో త్వరలో జరగనున్న జోనల్ యూనివర్సిటీ ఫెన్సింగ్ క్రీడలో రాష్ట్రం నుంచి పాల్గొనే జట్టులో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి దేవమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ స్థాయి ఫెన్సింగ్ మహిళా విభాగం పోటీలలో ఎండీవీ శ్రీరూప్య, పురుషుల విభాగంలో కె.పవన్‌కుమార్ పతకాలు సాధించి జోనల్ స్థాయి యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. చెన్నైలో జరిగే జోనల్ యూనివర్సిటీ కబడ్డీ బాలికల విభాగం పోటీలకు ఎం.శ్రీవల్లి, ఎల్.వరలక్ష్మి ఎంపికయ్యారని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక



సంతకవిటి: పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

వంగర: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొమరాపు చందు, బొడ్డోతు సౌమ్యలు ఎంపికైన వారిలో ఉన్నారని ప్రధానోపాధ్యాయురాలు ముద్దాడ రమణమ్మ శనివారం తెలిపారు. వీరంతా ఈ నెల 3, 4వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. సదరు విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.



వంగర: విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆర్.స్వాతి, జి.గంగోత్రి, బి.జ్యోత్స్నలు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని, వీరంతా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు శనివారం తెలిపారు.

చి'వరి'లో ఇదేం తీరు..!

- నీరు విడిచిపెట్టలేక... రేంచీ కీ దాచేసిన అధికారులు
- రైతులకు బ్లాక్ మెయిల్..
- సొంత డబ్బులతో రేంచీ కీ తయారు చేసిన రైతులు
- ఇంతలో పోయిన పాత కీ తెచ్చి, నీరులేదని చెప్పేసిన అధికారులు



16 ఎల్ కాలువ ఆయకట్టులో చివరి తడిలేక నష్టపోయిన వరి పంట



పోయిందని షాక్‌లు చెప్పిన రెంచ్ కీ

రాజాం/సంతకవిటి: ఆరుగాలం శ్రమించి అందరికీ అన్నంపెట్టే రైతన్నకు అండగా ఉండాల్సిన మడ్డువలస ప్రాజెక్టు అధికారులు... ఆవేదనకు గురిచేస్తున్నారు. సాగునీటికోసం ఆరాటపడుతున్న ఆయకట్టు శివారు భూముల రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. సాగునీరు విడిచిపెట్టకుండా రేంచ్‌కీ పోయిందంటూ బ్లాక్‌మెయిల్ చేయడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. సంతకవిటి మండలం సిరిపురం, బలరాంపేట, శేషాద్రిపురం, శివకాలపేట, జానకీపురం, జీఎన్‌పురం తదితర గ్రామాల పంటపొలాలకు మడ్డువలస 16ఎల్, 15ఆర్, పిల్లకాలువలు ద్వారా మూడువేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచే రైతులకు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. బావుల నీటితో పంటను కోతదశ వరకూ తీసుకొచ్చారు. చివరి తడిగా మడ్డువలస కాలువ నీటిని అందించాలని వారం రోజుల కిందట కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అక్కడి నుంచి మడ్డువలస కాలువ అధికారులపై ఒత్తిడి రావడంతో పాటు ఇటు రైతులు నుంచి సాగునీటి ఒత్తిడి అధికమైంది. దీంతో పిల్లకాలువలకు నీటిని తరలించే రెగ్యులేటర్ తలుపులకు సంబంధించిన రేంచీ కీలు పోయాయని మడ్డువలస కాలువ అధికారులు కొత్త షాకులు చెప్పడం ప్రారంభించారు. రైతులే రేంచీ కీని తీసుకెళ్లారని ఒకసారి, పోయిందని మరోసారి ఆరోపిస్తూ సాగునీటి కోసం అధికారులను ప్రశ్నించిన, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన రైతులను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. నాలుగురోజులుగా సాగునీరు విడిచిపెట్టకుండా కాలయాపన చేశారు. రైతులు కొత్త రేంచీ కీని శనివారం సిద్ధం చేయడంతో అధికారులు పాత రేంచీకీ దొరికిందని చెప్పి లష్కర్ దాలినాయుడుతో పంపించారు. చివరకు ప్రాజెక్టులో నీరు లేదని, శివారు ప్రాంతాలకు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. దీనిపై ప్రాజెక్టు ఏఈ వెంకట్‌కు రైతులు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో రైతులు మండిపడ్డారు. కావాలనే రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని ఏఈ వెంకట్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా సిరిపురంతో పాటు పరిసర గ్రామాల పంట పొలాలకు సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. శివారు ప్రాంతాలకు కూడా సాగునీరు అందించామని, రైతులు ఉత్తునే ఆరోపిస్తున్నారని, రేంచ్ కీ లేదని ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయలేదన్నారు.

ఇబ్బంది పెట్టారు..



సాగునీటి కోసం మా గ్రామ రైతులందరం చాలా ఇబ్బందులు పడ్డాం. ఆరువేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందక ఊటబావుల నీటిపై ఆధారపడ్డాం. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుచేశాం. దీంతో ప్రాజెక్టు ఏఈ వెంకట్‌తో పాటు లష్కర్‌లు బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. నీటిని విడిచిపెట్టే ఉద్దేశం లేక రేంచ్‌కీ పోయిందని, రైతులే పట్టుకెళ్లిపోయారని ఆరోపించారు. సకాలంలో సాగునీరు అందక సిరిపురం, బలరాంపేట, శేషాద్రిపురం తదితర గ్రామాల్లోని 3 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వచ్చింది. దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంది.

– పి.రాంబాబు, రైతు, సిరిపురం

పక్కాగా నైపుణ్య గణన : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: తప్పులకు ఆస్కారం లేకుండా నైపుణ్య గణన – 2024ను పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నైపుణ్య గణన – 2024పై ఎంపీడీఓలతో కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు గల వారి పూర్తి వివరాలను నైపుణ్య గణనలో నమోదు చేయించాలన్నారు. ఇందుకు ప్రతి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సరైన శిక్షణ ఇచ్చి ప్రతి ఇంటిని సందర్శించేలా చేయాలన్నారు. అంతకు ముందు నైపుణ్య గణనపై ఎంపీడీఓలు పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకొని, దిగువ స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బందికి పంపే సమయంలో మ్యాపింగ్ అనేది తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇంటిలోని ప్రతి సభ్యుని విద్యార్హతలతో పూర్తి వివరాలు సేకరించాల్సి ఉన్నందున చాలా జాగ్రత్తగా వివరాలు సేకరించాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జరిగి నైపుణ్య గణనలో జిల్లాలో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండి ప్రాంతాలను ముందుగా ఎంచుకొని, వాటి పరిధిలో గణనను చేపట్టాలని సూచించారు. జిల్లాలో రక్తహీనత లోపం ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, అందుకే మేము సైతం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రక్తనిల్వలు ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఎంపీడీఓ తమ పరిధిలోని కళాశాలలు, యువతకు అవగాహన కల్పించి, రక్తదానం చేసేందుకు శిబిరాలను ఏర్పాటు చేసి కనీసం 75 యూనిట్ల రక్తం సేకరణ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డిజిటల్ లైబ్రరీల కోసం 11 మండలాల్లో ఇప్పటికీ సామగ్రిని పంపిణీ చేసామని, వాటిని వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులైన యువతకు ఉపయోగపడేలా పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. స్థలాభావం కారణంగా డిజిటల్ లైబ్రరీలను వినియోగించుకోని మండల అధికారులు, ఇతర మండలాల్లో వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా.వినోద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.సాయికృష్ణ చైతన్య, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకరరావు, ఎంపీడఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.